క్లుప్తంగా

రోడ్లకు మరమ్మతులు చేయించండి



తెనాలిఅర్బన్: పట్టణ పరిధిలోని ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం తెనాలి కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బండి శేషన్నను మంగళవారం కలసి వినతిపత్రం అందజేశారు. రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. ఆయన వెంట షేక్ హుస్సేన్‌వలీ ఉన్నారు.

వరద బాధితులకు శ్రీశైల భక్త సేవాసమితి సాయం

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీశైల భక్త సేవా సమితి బృందం వరద బాధితుల కోసం మంగళవారం అయిదు వేల భోజన ప్యాకెట్లు, మంచినీటి ప్యాకెట్లు, పెరుగు ప్యాకెట్లను సిద్ధంచేసి, కృష్ణాజిల్లా తోట్లవల్లూరు గ్రామానికి తరలించారు. అక్కడి మండల తహసీల్దారు కుసుమ వినతితో ప్రత్యేక వాహనంలో ఆహారాన్ని తీసుకెళ్లారు. సోమవారం రాత్రి కొల్లిపర మండలం హనుమాన్‌పాలెంలో 500 మందికి సరిపడా ఆహారపదార్థాలను అందజేసినట్టు తెలిపారు. సేవాసమితి అధ్యక్షుడు ఏవీ సుబ్బయ్య, కార్యదర్శి పరిమి గోవర్ధన్, కోశాధికారి కోనా బ్రహ్మానందం గుప్త, సభ్యులు పూర్ణచంద్రరావు, సత్యనారాయణ, రవీంద్ర, కొడాలి భారతి, శాంతికుమారి పాల్గొన్నారు.

7న తెనాలిలో భానుమతి శతజయంతి సభ

తెనాలి: ప్రముఖ నటీమణి, గాయని, దర్శక, నిర్మాత పద్మభూషణ్ డాక్టర్ భానుమతి రామకృష్ణ శతజయంతిని తెనాలిలో ఈనెల 7వ తేదీన నిర్వహించనున్నారు. తెనాలి రామకృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో ఆరోజు సాయంత్రం ఆరు గంటలకు ఏర్పాటయే సభకు చైతన్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షత వహిస్తారు. ప్రముఖ రచయిత్రి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, ప్రముఖ పాత్రికేయుడు రెంటాల జయదేవ, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ, నిర్వాహక అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు మాట్లాడతారు. సభానంతరం సినీ సంగీత విభావరిలో డాక్టర్ వెంపటి సత్యనారాయణ, బెల్లంకొండ భారతిలు డాక్టర్ భానుమతి పాటలను గానం చేస్తారని నిర్వాహకులు తెలియజేశారు.

పింఛన్‌కు వెళ్లి అదృశ్యమయ్యాడు!



తెనాలిరూరల్: పింఛన్ కోసం వెళ్లిన వ్యక్తి కనబడకుండాపోయాడు. పట్టణానికి చెందిన అద్దంకి శ్రీనివాసరావు (65) పెదరావూరు జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకుని అక్కడే కుటుంబంతో నివసిస్తున్నాడు. గత నెల 31న ప్రభుత్వం ఇచ్చిన పింఛన్ తీసుకునేందుకు పెదరావూరు నుంచి మారిస్‌పేట సీఎం కాలనీలోని సచివాలయానికి బయలుదేరాడు. అక్కడకు వెళ్లి పింఛన్ తీసుకోలేదు. అదే రోజు నుంచి కనబడకుండాపోయాడు. ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు మంగళవారం తెలిపారు.

పేదలకు ఆహార ప్యాకెట్లు పంపిణీ



తెనాలిఅర్బన్: మదర్‌థెరిస్సా ఫ్రెండ్స్ సర్కిల్, బిల్డర్స్ అసోసియేషన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో యడ్లలింగయ్య కాలనీలోని పేదలకు మంగళవారం భోజనం ప్యాకెట్లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా బీటీవీఎస్ నారాయణ మాట్లాడుతూ యడ్లలింగయ్య కాలనీలోని పేదలకు అన్నదానం, వస్త్రదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎ.ప్రసాద్, కొత్త రామారావు, చావాలి రాజేంద్రప్రసాద్, లక్ష్మీనారాయణ, ఫణీంద్ర, మధుబాబు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ డిమాండ్
- పునరావాస కేంద్రంలో బాధితులకు పరామర్శ



తూములూరులో బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

కొల్లిపర: కృష్ణా నదిలో వరదల కారణంగా లంక గ్రామాల్లో పంటలు నష్టం జరిగిన ప్రతి రైతును కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని తూములూరు, హనుమాన్‌పాలెంలో ఏర్పాటు చేసిన వరద బాధితుల పునరావాస కేంద్రాల్లోని వసతులు, పాత బొమ్మువానిపాలెంలో వరదలో ఉన్న పంటలను మాజీ ఎమ్మెల్యే శివకుమార్ ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లిపర మండలంలో 2019లో వర్షాలు కారణంగా 89 మంది రైతులకు, వరదలు కారణంగా 452 మంది రైతులకు రూ.1.8 కోట్లు, 2021లో నివాస్ సైక్లోన్ వచ్చినప్పుడు 14804 మంది రైతులకు రూ.13.38 కోట్ల, 2021లో కృష్ణానది వరదలకు 452 మంది రైతులకు రూ.18.62 లక్షలు, నంబరులో వర్షాలు కారణంగా 8362 మంది రైతులకు రూ.8.80 కోట్ల , 2022 లో మ్యాండోస్ సైక్లోన్ వచ్చినప్పుడు 2489 మంది రైతులకు రూ.2.8 కోట్ల వైసీపీ ప్రభుత్వంలో రైతులకు అందించిన నష్టపరిహారం అని వివరించారు.

సుమారు వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కొల్లిపర మండలంలో రైతులకు పంటల నష్టం క్రింద రూ.24 కోట్లు అందించినట్లు తెలిపారు. కొల్లిపర మండలంలో వరదలు కారణంగా కరకట్ట దిగువున ఉన్న అరటి, పసుపు కంద వంటి వాణిజ్య పంటలు సుమారు 992 ఎకరాలలో పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నట్లు, 150 ఎకరాలు మినుము దెబ్బతిన్నట్లు, ఆస్నా తుపాన్ కారణంగా మాగాణి భూమిలో వరి పంట సుమారు 1500 ఎకరాలలో పాక్షికంగా దెబ్బతిన్నట్లు తెలిపారు. దెబ్బతిన్న ఈ పంటలకు ఇప్పటి వరకు ప్రభుత్వం 70 శాతం మంది రైతులకు కూడా ఈ క్రాప్ బుకింగ్ చేయకపోవటం సిగ్గుచేటన్నారు.

గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి రైతుకు ఈ క్రాప్ బుకింగ్ చేసి ఇటువంటి సమయంలో వారికి క్రాప్ ఇన్సూరెన్స్ ద్వారా వారిని నేరుగా నష్టపరిహారం అందించటం జరిగిందని గుర్తు చేశారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా రాష్ట్రంలో 2009లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉన్న సమయంలో వరదలు, వర్షాలు కారణంగా దెబ్బతిన్న పసుపు రైతులకు ఎకరానికి రూ.50 వేలు అందించారని కొనియాడారు. అదే విధంగా అరటికి ఎకరానికి రూ.80వేలు, ఎకరానికి వరికి రూ.6,800 ఇచ్చినట్లు తెలిపారు. గత 5 సంవత్సరాలలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తెనాలి నియోజకవర్గంలో 26640 మంది రైతులకు రూ.25 కోట్ల రైతులకు నేరుగా వారి ఖాతాలో జమ చేయటం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు అందించిన విధంగా ఇవ్వాలని లేదా గత ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వంలో రైతులకు ఎక్కువ మంచి చేస్తాం అని చెప్పుకు తిరుగుతున్న నాయకులు ఇటువంటి సమయంలో నష్టం జరిగిన రైతులకు ఎక్కువ నష్ట పరిహారం అందిస్తే అంతకన్నా ఎవరికైనా ఏమి కావాలని అన్నారు. వై ఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు ఇచ్చిన దానికన్న ఎక్కువ ఇస్తే ఆనందించే వారిలో మొదటి వ్యక్తిగా మాజీ సీఎం జగన్, స్థానిక వ్యక్తిగా తాను ఎంతో సంతోషిస్తామని తెలిపారు. ఇప్పటికైనా గత ప్రభుత్వం రైతులను ఏవిధంగా ఆదుకుంది అన్న విషయాలను గ్రహించి వరదల కారణంగా దెబ్బతిన్న ప్రతీ రైతు పంటలను ఈ క్రాప్ చేసి వెంటనే నష్ట పరిహారం అందించాలన్నారు. తొలుత ఆయన వరద బాధితులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాసం కేంద్రాలను సందర్శించి, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు బాధితులకు ఏర్పాటు చేసిన పండ్లను వారికి నాయకుల చేతుల మీదు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, భీమవరపు సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు అవుతు పోతిరెడ్డి జొన్నల శివారెడ్డి, మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, ఉయ్యూరు ఉమామహేశ్వరరెడ్డి, ఈద హర్షవర్ధన్‌రెడ్డి, బద్దిగం శ్రీనివాసరెడ్డి, బేతాల భూషణం, బొమ్ము వెంకటరెడ్డి, బొమ్ము శ్రీనివాసరెడ్డి, ఆరిగ చంద్రారెడ్డి, రామిరెడ్డి, ఈద యశ్వంత్‌రెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, పిల్లి గంగాధర్ పాల్గొన్నారు.

మాగాణుల్లో వరద నీరు బయటకు పంపాలి

- స్థానిక యంత్రాంగం చర్యలు చేపట్టాలి
- వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఆదేశం



పంటనష్టం గురించి రైతులను అడిగి తెలుసుకుంటున్న బి.రాజశేఖర్

కొల్లిపర: తుఫాన్ ఆస్నా ప్రభావంతో కురిసిన అధిక వర్షాలు కారణంగా మాగాణి భూమిలో నిలిచిన వరద నీరు తక్షణమే బయటికి పోయే విధంగా అధికార యంత్రాంగం వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులకు వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.రాజశేఖర్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని వల్లభాపురం, అత్తలూరిపాలెం, దంతలూరు, అత్తోట తదితర గ్రామాలలో భారీ వర్షాల కారణంగా ఆయా గ్రామాలలో నీటిలో ఉన్న వరి పంటలను వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్, వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు, తెనాలి సబ్‌కలెక్టర్ సంజన సింహా, గుంటూరు జిల్లా వ్యవసాయాధికారి ఎన్.వెంకటేశ్వర్లు, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆర్.శారదా జయలక్ష్మి, డైరెక్టర్ రీసర్చ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పి.సత్యనారాయణ, అసోసియేట్ డైరెక్టర్ లాం ఫారం దుర్గా ప్రసాద్, స్థానిక వ్యవసాయాధికారులతో కలసి పరిశీలించారు.ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఈ పంటలో తప్పనిసరిగా నిజమైన సాగుదారుడిని నమోదు చేసి వారికి ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలని వ్యవసాయాధికారులకు ఆదేశించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు మాట్లాడుతూ వరద ద్వారా ముంపునకు గురైన ప్రతి పంటను పరిశీలించి పంట నష్టం అంచనా వేసి నివేదిక తయారు చేయటం నాలుగు రోజులలో జరుగుతుందన్నారు. వరద నీరు బయటకు పంపిన తరువాత అధికారులు సిఫారసు చేయబడిన బూస్టర్ డోస్ ఎరువులు వాడాలని రైతులకు సూచించారు.ఈ పర్యటనలో తెనాలి సహాయ వ్యవసాయ సహాయకులు ఎస్.ఉషారాణి, ఏవో కె.వెంటరావు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ జాగ్రత్తలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- సహాయక చర్యల్లోనూ అదే వైఖరి
- రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లిముంత సాంబశివరావు

తెనాలి: భారీ వర్షాల ప్రమాదంపై మూడురోజుల ముందే తగిన హెచ్చరికలున్నా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బొల్లిముంత సాంబశివరావు విమర్శించారు. ఫలితంగా ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని, బుడమేరు వరదతో విజయవాడలోని అనేక ప్రాంతాలు జలదిగ్బంధనంలో ఉన్నాయని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 3 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టంకాగా, ఇప్పటివరకు 19 మంది ప్రాణాలు కోల్పోయినట్టు గుర్తుచేశారు. సహాయక చర్యల్లోనూ ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందనీ, లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించటం సాధ్యం కాదని, సహాయక చర్యలు సక్రమంగా అమలుకాక పోవటానికి అధికారులే కారణమని ముఖ్యమంత్రి చెప్పటం ఆయన స్థాయిని బలహీన పరుస్తుందని సాంబశివరావు విమర్శించారు. తుఫాన్ బాధితుల, రైతుల అవస్థలు దృష్టిలో పెట్టుకుని వరి పైరు ముంపునకి గురైన ప్రతి రైతుకి ఎకరాకి రూ.15 వేలు, పసుపు, కంద పంటలకు రూ.25 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు 50 కిలోల బియ్యం, కందిపప్పు, ఉల్లిపాయలు, చింతపండు, వంట నూనె కేజీ చొప్పున ఇవ్వాలి, అంటు వ్యాధులు ప్రబల కుండా చర్యలు చేపట్టాలని రైతు కూలీ సంఘం తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బాధితులకు మౌలిక వసతులు కల్పించండి

- వరద ఉధృతి పూర్తిస్థాయిలో తగ్గే వరకు కేంద్రాల్లోనే ఉండాలి
- తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజన సింహా



హనుమాన్‌పాలెంలో మాట్లాడుతున్న తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజన సింహా

కొల్లిపర: కృష్ణా నదిలో వరద ఉధృతి పూర్తి స్థాయిలో తగ్గే వరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారలు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజన సింహా ఆదేశించారు. మంగళవారం మండలంలోని తూములూరు, హనుమాన్ పాలెం పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఆమె పరిశీలించారు. బాధితులకు భోజనం, మంచినీరు వంటి సౌకర్యాలు ఎలా ఉన్నాయి అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నదిలో వరద ఉధృతి తగ్గే వరకు ప్రజలు పునరావాస కేంద్రంలో ఉండాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులున్నా వారు స్వయంగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు సిద్ధార్థ, ఈవోపీఆర్డీ పూర్ణశంకరరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఫార్మశీ విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

తెనాలి: డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. కాలేజీ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ముఖ్యఅతిథి డాక్టర్ ఎస్.సునీల్ కంటి ప్రాధాన్యతను, డాక్టర్ పి.భాస్కర్ నేత్రదానం విశిష్టతను వివరించారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, చార్వాక విజ్ఞాన కేంద్రం నిర్వహణ అధికారి ఎస్.నారాయణరావు, ఎన్ఎస్ఎస్ 1, 2 విభాగాల ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జ్యోతి బసు కె.కళ్యాణ్ చక్రవర్తి, ఐపీఏ-ఎస్ఎఫ్ మెంటర్స్ జి.నందగోపాలకృష్ణ, పి.భార్గవి, అధ్యాపకులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

‘కృష్ణమ్మ’ కోపం.. ‘కృష్ణయ్య’ సాయం!



ఉండవల్లి అమరావతి కరకట్ట వెంట ఇస్కాన్ టెంపుల్‌లోకి వచ్చిన వరద నీరు



విజయవాడలో ఆహార పొట్లాలు పంచడానికి వెళుతున్న ఇస్కాన్ టెంపుల్ సేవకులు

- వరద బాధితులకు మూడు రోజులుగా ఆహారం తయారీ
- మానవత్వం చాటుకున్న ఇస్కాన్ టెంపుల్ సిబ్బంది

తాడేపల్లి రూరల్: అమరావతి కరకట్ట వెంట ఉండవల్లిలో ఉన్న విజయవాడ ఇస్కాన్ టెంపుల్ కృష్ణా నది వరదకు మునిగిపోయింది. అయినా వెనుకాడకుండా ఇక్కడి సేవకులు సహాయక చర్యల్లో పాలు పంచుకుంటున్నారు. తమ మానవత్వాన్ని చాటుకుంటూ మంగళవారం కూడా సేవలు చేశారు. ఈ టెంపుల్‌లో 8 అడుగుల మేర వరద నీరు చేరింది. రాధా శ్యామ్ సుందర్ విగ్రహాలను ముంచెత్తినా ఎట్టి పరిస్థితుల్లోనూ బాధల్లో ఉన్న వారికి ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో ముందుకు కదిలారు. విజయవాడలోని పలు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో కరకట్టపైనే ఆహారాన్ని తయారు చేశారు. అక్కడి నుంచి విజయవాడ శ్రీ జగన్నాథ మందిరానికి చేర్చి... తర్వాత పలు ప్రాంతాలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశామని ఇస్కాన్ టెంపుల్ నిర్వాహకులు శ్యామ్ సుందర్ అచ్యుత దాస్ తెలిపారు.

మునిగిన పంటలు పరిశీలించిన ఉన్నతాధికారులు



రైతులతో మాట్లాడుతున్న ఉన్నతాధికారులు

తెనాలి: కృష్ణానది వరద ప్రభావంతో నీట మునిగిన పంటలను రాష్ట్ర వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు మంగళవారం పరిశీలించారు. వ్యవసాయశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఢిల్లీరావు, ప్రిన్సిపల్ సెక్రటరీ పి.రాజశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు, ఏడీఏ ఎస్.ఉషారాణి బృందం వ్యవసాయశాఖ తెనాలి సబ్‌డివిజను పరిధిలో పర్యటించింది. కొల్లిపర మండలంలోని వల్లభాపురం, దంతలూరు, అత్తోట, తెనాలి మండలంలోని హాఫ్‌పేట, ఖాజీపేట గ్రామాల్లో రైతులను కలిసింది. నీటిలో మునిగిన పంటలను అధికారులు పరిశీలించారు. పలువురు రైతులతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ చూడనివిధంగా వరద ప్రభావం ఉందని, దీంతో తీవ్రంగా నష్టపోయామని అన్నదాతలు వాపోయారు. నష్టం అంచనాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని, అధైర్యపడొద్దంటూ ఉన్నతాధికారులు వారికి హామీ ఇచ్చారు. ప్రాథమిక అంచనాల ప్రకారం కొల్లిపర మండలంలో 14,900 ఎకరాల్లో వరిసాగు ఉండగా, 4,400 ఎకరాల్లో పంట ముంపునకు గురైనట్టు ఏడీఏ ఉషారాణి ఉన్నతాధికారులకు వివరించారు. ప్రస్తుతం వరిపైరు 30-40 రోజుల దశలో ఉందని చెప్పారు. రైతులు సాధ్యమైనంత త్వరగా ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని, ప్రభుత్వ మార్గదర్శకాల అనంతరం పంట నష్టం అంచనాలు ఉంటాయని సూచించారు.

విద్యార్థిని అదృశ్యం

తెనాలిరూరల్: బీటెక్‌విద్యార్థిని అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ నాజరుపేటకు చెందిన యువతి ప్రియ బుడంపాడులో బీటెక్ ఫస్టియర్ చదువుతోంది. మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుండి సమీపంలోని షాప్‌కు వెళ్లి వస్తా అని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: బహిరంగంగా పేకాట ఆడుతున్న వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ పాండురంగపేటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. 5900 స్వాధీనపర్చుకున్నారు.

అధికారుల అప్రమత్తతతో తప్పిన పెనుముప్పు



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మహానాడు ప్రాంతంలో పెను ప్రమాదాన్ని నివారించడంలో కార్పొరేషన్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు. సేకరించిన వివరాల ప్రకారం.. కృష్ణానది ఉగ్రరూపం దాల్చి వరద నీరు కరకట్టకు 5 అడుగుల వరకు వచ్చి చేరింది. రైల్వే ట్రాక్ పక్కన ఇటీవల కొత్త ట్రాక్ కోసం 10 అడుగుల దూరం కరకట్టను తొలగించారు. స్థానికుల సమాచారం అందించడంతో డి.ఇ. కృష్ణారెడ్డి ఈ విషయాన్ని కమిషనర్ అలీం బాషాకు చెప్పారు. స్థానికుల సహకారంతో ఇసుక బస్తాలు వేసేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం రెండువైపులా మట్టి పోయించారు. దీంతో వరద నీరు కరకట్ట దాటి ఇవతలకు రాలేదు. మంగళవారం ఉదయం ఈ విషయాన్ని వారు గుర్తించకపోతే మహానాడుతోపాటు పట్టాభిరామయ్య కాలనీ, ఎన్‌టీఆర్ కరకట్ట వెంబడి వరద నీరు వచ్చి భారీ నష్టం వాటిల్లేదని స్థానికులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఫిరంగిపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు శ్వేత చెప్పారు. మండలకేంద్రంలోని సచివాలయం-3 పరిధిలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. 87మందికి వైద్యురాలు శ్వేత వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈసందర్భంగా సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. మంచినీరు ఎక్కువ రోజులు నిలువ ఉంచకుండా నాలుగు రోజులకోమారు శుభ్రంగా కడుగుకోవాలని చెప్పారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు కలిగించే దోమలు లార్వాను మంచినీరు నిలువ ఉండే ప్రదేశాల్లో ఉంచుతాయని తెలిపారు. అందుచేత ఆప్రదేశాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఫ్రైడే-డ్రైడేలో భాగంగా ఆరోగ్యసిబ్బంది ఇంటింటికి వచ్చి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడిగా ఉండే పదార్థాలు ఆహారంగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ గోవర్ధన, ఏఎన్ఎం భారతీజ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణానదిలోకి దూకిన వివాహిత

- అప్రమత్తమైన పోలీసులు
- మత్స్యకారుల సహకారంతో కాపాడిన వైనం
- కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యాయత్నం



బోటులో మహిళను బయటకు తీసుకు వస్తున్న మత్స్యకారులు, స్థానికులు



చికిత్స పొందుతున్న విజయ

తాడేపల్లిరూరల్: పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన ఓ వివాహిత తాడేపల్లి పరిధిలోని కనకదుర్గ వారధిపై నుంచి ఒక్కసారిగా కృష్ణానదిలోకి దూకింది. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ హఠాత్పరిణామానికి అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తమయ్యారు. మత్స్యకారుల సాయంతో ఆమెను కాపాడారు. పోలీసుల కథనం ప్రకారం.. చిలకలూరిపేటకు చెందిన పసుపులేటి విజయ, శ్రావణ్‌కు ఐదేళ్ల క్రితం పెళ్లయింది. భర్తతో గొడవల వల్ల విజయవాడలో ఉన్న తమ్ముడు రమణ వద్దకు విజయ వచ్చింది. తమ్ముడు అక్కకు సర్దిచెప్పి తెనాలిలో ఉన్న తల్లి వద్దకు ద్విచక్రవాహనంపై మేనల్లుడితో కలిసి తీసుకు వెళ్తుండగా కృష్ణానది వరదను చూస్తానని చెప్పి కనకదుర్గ వారధిపై ద్విచక్రవాహనం దిగింది. రమణ వారించేలోగా విజయ కృష్ణానదిలోకి దూకింది. దీంతో అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ రహీమ్ అప్రమత్తమై మణిపాల్ హాస్పిటల్ వద్ద విధుల్లో ఉన్న మంగళగిరి టౌన్ ఎస్ఐ నారాయణకు సమాచారం ఇచ్చారు. మరో యువకుడితో కలిసి నదిలోకి దిగి వివాహితను కాపాడేందుకు యత్నించినా ప్రవాహ వేగానికి విజయ మూడు కిలోమీటర్ల దూరం కొట్టుకుపోయింది. దీంతో ఎస్ఐ నారాయణ నదిలో ఉన్న మత్స్యకారులను అప్రమత్తం చేసి పడవల్లో వెళ్లి విజయను కాపాడారు. ఆమెను పడవలోకి ఎక్కించారు. అప్పటికే ఆమె అపస్మారక స్థితికి చేరడంతో తాడేపల్లిలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

విజయవాడ వెళ్లిన తెనాలి పారిశుద్ధ్య కార్మికులు

తెనాలిఅర్బన్: వరద సహాయ చర్యల్లో పాల్గొనేందుకు తెనాలి పురపాలక సంఘ పరిధిలోని 50 మంది కార్మికులు, పలువురు ఉద్యోగులు మంగళవారం విజయవాడ వెళ్లారు. విజయవాడ జలదిగ్బంధంలో ఉన్న విషయం తెలిసిందే. ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులను చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెనాలి నుంచి కార్మికులు వెళ్లినట్లు అధికారులు తెలిపారు. కొన్ని రోజులపాటు అక్కడే ఉండి సహాయక చర్యల్లో వారు పాల్గొంటారు.